# మామగారి వర పరీక్ష

(కథానిక)

టి. యల్. నరసింహం

ముకుందరావు రైల్లో కూర్చున్నాడు. ఎదురుగుండా బల్లమీద ఒక యువకుడు ఏదో పత్రిక చదువుతూ కూచున్నాడు. రైలు కదిలాక అందరూ సీట్లు సంపాదించుకుని సర్దుకుంటున్నారు. ముకుందరావు పక్కన తన చిన్న సూటుకేసు ఒక సంచీ పెట్టుకుని వాటిమీద చేతిని విలాసంగా వుంచి కూచున్నాడు. ఎదురు బెంచిమీద ఇరుకుగానే వుంది.

ఇంతలో ఒక కాలేజీ విద్యార్థిని వచ్చి ముకుందరావుని ఆ పెట్టె తియ్యమన్నది. ఆయన నెమ్మదిగా నిరాకరించాడు. కాని కొలది సేపట్లో ఆయన బలవంతంమీద పెట్టెతీసి పై బెర్తుమీద పెట్టాడు. సంచిని మాత్రం ఆయనే పట్టుకున్నాడు, పక్కని కొంచెం చోటు చేసి.

మరో రెండు నిముషాలు పోయేక ఒక ముసలావిడ తన బుట్టని పై బెర్తుమీద పెట్టి ముకుందరావుతో 'బాబుగారూ ఈ సంచి తీసి బల్లమీద పెడతారా కొంచెం?' అన్నది.

ముకుందరావు 'వల్లకాదు' అన్నాడు. 'సంచీల్ని కూడా కూచునేచోట్లో పెడితే ఎలాగండీ?' అన్నది ఆ ముసలావిడ.

'ఎలాగేమిటి? ఆలాగే.'

'తియ్యండీ!' అని కాస్త దబాయించినట్టుగా అన్నది ఆవిడ.

ఎదురుగుండా వున్న యువకుడు ఇటు చూస్తున్నాడు-పత్రిక మూసేశాడు.

'మరో చోటికి వెళ్లవమ్మా' అన్నాడు ముకుందరావు. 'ఎందుకూ? ఇక్కడ చోటుండిగా!' అన్నాడా యువకుడు.

ముకుందరావు అతనికేసి చూశాడు. ఆ యువకుడి కళ్లు తీక్షణంగా హక్కుల కోసం పోరాడే డెమోక్రాట్లలా వున్నాయి.

'చోటేది?'

'ఆ సంచీ తీస్తే మీరు చోటివ్వగలరు. ఆ మాత్రం తెలియదనుకోకండి.'

'మీరు లేచిపోయి చోటివ్వవచ్చు, కావలిస్తే'

'నేనైతే మనిషిని లేవాలి. మీరైతే ప్రాణంలేని ఆ సంచీని ఆ బల్లమీదపెట్టి ఆవిడకి చోటివ్వొచ్చు.' ఆ సంచీ ఎక్కడున్నా ఏం బాధపడదు. నేనైతే బాధపడతాను. ఆ ముసలావిడైతే మరీ బాధపడుతుంది' అన్నాడా యువకుడు.

'మీరెన్ననుకున్నా ఫరవాలేదు. ఈసంచిలో డబ్బు దాచుకున్నాను. అంచేత ఇది నా దగ్గర వుండవలసిందే.'

'అయితే ఒళ్లో పెట్టుకోండి.'

'రైల్లో నేను రిజర్వు చేసుకున్న జాగా వుండగా ఈ బరువంతా మొయ్యవలసిన అవసరం నాకు లేదు.'

'కాని మీరాచోటు రిజర్వు చేసుకోలేదు.' ముకుందరావు మాటాడలేదు.

'-మీరాచోటును రిజర్వు చేసుకుందికి ఒక్క టిక్కెట్టు చాలదు. ఆచోటు మీరిప్పుడు రిజర్వు చేసుకోలేదు. దురాక్రమణవల్ల వశపర్చుకున్నారు. మీకు సంచీ పెట్టుకుందికి చోటు కూడా చూపెట్టినప్పుడు మీరింకా ఆపట్టు విడవకపోవడం మూర్ఖం.'

'ఏమిటి మీ ఉద్దేశం? నా డబ్బు సంచీని అలా మీద పడెయ్యమంటారా?'

'అందువల్ల నష్టం లేదనికూడా అంటాను.'

'ఎందుకులేదు? మరిచిపోతే!'

'మరిచిపోతే అది మీ పొరపాటు. పొరపాటు చేస్తే నష్టం అనుభవించక తప్పుతుందేమిటి?'

-ఇన్ని కబుర్లు చెప్తున్నవాళ్లు మీరు షివల్రీ ఎందుకు చూపించకూడదు? మీ ఇంగ్లీషువాళ్ళు ఆడదివొచ్చే సరికల్లా సీట్లు ఖాళీచేస్తారే!'

'నేను షివల్రీని నమ్మను.'

'ఏం!'

'షివల్రీ అంటే ఆత్మవంచన.'

'ఓహో!'

'కాక? షివల్రీవల్ల మగాడు తన సీటు న్యాయతః తనకి రావలసిన సీటు వొదులుకుంటున్నాడు. అది సేక్రిఫైస్ అంటారు మీరు. కాని సేక్రిఫైసంటే ఆత్మవంచనే.'

'ఆత్మవంచన అయితే?'

'అయితే అని యింకా మెల్లిగా అడుగుతున్నారేమిటి, ఆత్మవంచన ఈ ప్రపంచంలో చాలా గొప్పపాపం. పాపం మాట అటుంచగా అది చాలా పెద్ద నేరం.

'తమ కార్యంబు పరిత్యజించియు పరహితార్థ వ్యాపరుల్ సజ్జనుల్' అంటారే- ఈ సజ్జనులందరూ ఆత్మవంచకులే. తనకి మాలినధర్మం అంటే తప్పుగాదూ మరి?'

'అందుకే నేను చోటివ్వ వంటున్నాను'

'మీ కేసు వేరు. మీరు మీకు మాలినధర్మం చెయ్యక్కర్లేదు. మీ చోటుని మీరనుభవిస్తూ ఇతరులకి చోటివ్వగలరు. అదీగాక మీరు చేసేది ధర్మం కాదు...' అని ఇంకా ఏమిటో చెప్పబోతూ వుండగానే ముకుందరావు అన్నాడు. 'నేను పంచి ఇవ్వవలసిన భాగం షివల్రస్ గానే ఇచ్చేశాను. అంతకంటే నాకు తెలీదు.'

'మీ షివల్రీ లాజిక్ షివల్రీ. ఆ కాలేజీ స్టూడెంటుకి చోటిచ్చినవాళ్ళు ఈ ముసలావిడికి చోటివ్వకండా వున్నారు.'

'ఇంక మీరు వృథాగా నిందలు వెయ్యకండి' అని ఆయన చోటు చేసి ఇచ్చేశాడు.

అయిదు నిమిషాలు గడిచాక ఆ యువకుడు కొంచెం నెమ్మదిగా ఇలా అన్నాడు.

'మీరు పెద్దవాళ్ళు. మాలాంటి రెండోతరం వాళ్ళకి మంచిబుద్ధులు నేర్పాలిగాని ఇలాంటి ఎనార్కిస్టు స్పిరిట్సు' నేర్పొచ్చునా?

'నీతుల కేం లేవయ్యా!'

'నీతులు మనకక్కర్లేదని నేనూ ఒప్పుకుంటాను. కాని ఇండియా కూడా ఫస్టు క్లాస్ డెమోక్రసీ కావడానికి మనం కృషి చెయ్యాలి.'

'ఇప్పుడు మనం ఉన్నది ఏ క్లాసని?'

'థర్డు క్లాసు!'

'చుట్టూ ఉన్నవాళ్ళలో కొందరు విరగబడి నవ్వారు.

'చస్తే ఇండియా ఫస్టు క్లాస్ డెమోక్రసీ కాదు. మనకి ఆ భాగ్యం లేదు' అన్నాడు ముకుందరావు.

'మన చేతుల్లో వుంది. ఇండియా ఫస్టుక్లాసు డెమోక్రసీ కావడం!'

'లేదు అలా అనేస్తే యెలాగ?'

'ఏమిటి చేస్తారు మీరు, కృషి అంటే? ఇనీషియేటివూ రెఫరెండమూ ప్రవేశ పెడతారా?'

'అవి ఫస్టు క్లాసు డెమోక్రసీకి కాదు డైరెక్టు డెమోక్రసీకి'

'మరి?'

'మొట్ట మొదట అందరికీ డెమోక్రసీ అంటే ఏమిటో బోధపరచాలి - మన పల్లెటూళ్ళల్లో చాలామందికి గవర్నమెంటంటే అర్థం తెలీదు. అదేదో కేవలం శిక్షించడానికే ఉందని వాళ్ళ ఉద్దేశం. గవర్నమెంటంటే మనమేనని వాళ్ళకి తెలియజెప్పాలి'

'ఇప్పుడు వాళ్ళలో పీసూ ఆర్డరూ పోయి ఎనార్కీ వొస్తుంది.'

'ఇప్పుడు మహా ఉన్నాయి గనకనా?'

'అదే. డెమోక్రసీ ఛాయలు కలిగినప్పుడే వాళ్ళలో పీసూ ఆర్డరూ పోయాయి గదా? పరిపూర్ణమైన అర్థం తెలుస్తే వాళ్ళు డెమోక్రాట్లయి ఎనార్కిస్టులై పోతారు'

'లేదు. లేదు. నాగరికతను దిగుమతి చేసుకొని విద్యావంతులౌతారు.

'ఆ నాగరికత! మన ఇండియా కా భాగ్యం లేదండీ - స్వతంత్రం రావడమే ఓ పెద్ద కష్టమైపోయింది; ఇక నాగరికత వొస్తుంది' అన్నాడు ముకుందరావు వెటకారంగా.

'ఇండియాకి స్వతంత్రంరావడం ఓ భాగ్యమంటారా?'

'ఆఁ. భాగ్యంకాక?'

'-కేవలం భాగ్యమా? దానికి కారణంకూడా లేదా?'

'లేదు'

'మన నాయకులు కష్టపడ్డ ఫలితం కాదంటారా? మన స్ట్రగుల్ ఒత్తిడి కాదంటారా? స్వతంత్ర మివ్వకపోతే సేనొస్తానని కబురంపిన విప్లవమూ కాదంటారా? ఒట్టి భగవంతుడి దయమాత్రమేనా?'

'దయగాకపోతే వాళ్ల స్వతంత్రం ఇవ్వం అంటే మీరూ, మీ విప్లవాలు ఏం సాధిస్తాయి! సిపాయిల తిరుగుబాటు ఏం సాధించింది?

'అరే, వాడ్డు యూ మీన్? రివల్యూషన్ నెగ్గదనా!'

'చచ్చినా నెగ్గదు. బ్రిటిష్ ఎరరోగన్స్ కి తిరుగులేదు.'

'-మీ ఓల్డర్ జెనరేషన్ అంతా పెస్సిమిస్టులు. పెసిమిజమ్ మానసికపతనానికి మూల కారణం. అంచేతనే "శ్రీ శ్రీ"-ఎముకలు కుళ్ళిన, వయస్సుమళ్ళిన సోమరులారా చావండి— అన్నాడు.'

'మేం చస్తే మీరే వుంటారు.'

'అదే అభ్యుదయం. నిరాశ పనికిరాదు-ఆశ ఉంటేనే మానవుడు, ఆశ ఏడమ్ ఎండ్ ఈవ్ నాటిది. ఇవాల్టిదీ నిన్నటిదీ కాదు.'

ఇద్దరూ ఓ స్టేషన్‌లో దిగారు, ముకుందరావు చాలా చిరాకుపడి రామ్మూర్తిని అసహ్యించుకోడం సాగించాడు. కాని రైలు దిగి కొంతదూరం వెళ్లేక వీడితో నా సంబంధం ఇంతటితో తెగిపోయింది అని ఆయన సమ ర్థించుకోగలిగాడు.

మర్నాడు ఆయన ఇంపీరియల్ బ్యాంకులో తన సీటులో కూచున్నాడు. ఇంకా పదిగంటలే అయింది. అప్పుడే బ్యాంకు తెరిచారు. క్రితం రోజు రికార్డు అంతా తిరిగేస్తున్నాడు. ఎదురుగా ఒకవ్యక్తి నిలబడ్డట్టు ఆయన గమనించాడు.

ఆ వ్యక్తిని చూడవలసిన అవసరం తనకి లేదన్నట్టుగా అధికారి ఫాయిదాలో తల వంచుకు కూచున్నాడు.

ఆ వ్యక్తి "ఏమండీ—ఈ పదిరూపాయల నోటుకి చిల్లరివ్వండి-" అన్నాడు.

'పోయి ఊళ్లో మార్చుకోండి -' అన్నాడు ముకుందరావు. అజాగ్రత్తగా.

'ఊళ్లో మారక పోనండి, నూని మరకయింది అందుకని' అన్నాడా వ్యక్తి.

'ఇక్కడివ్వరు'

కేవలం ఇవ్వకపోతే ఎవరూ ఏం చెయ్యలే రనే తప్ప ఇవ్వరనిగాదు. ఏమయితేనేం ఆయన ఆ మాట ధైర్యంగా చెప్పాడు.

'ఇవ్వరూ!'

'ఇవ్వరు'

'అయితే యివ్వరని రాశిచ్చేండి ఈ కాయితం మీద-' అని ఆ వ్యక్తి ఓ కాయితం కూడా తీసి నట్టు ఓరకంటితో ముకుందరావు గమనించాడు.

'ఏవూరయ్యా నీది?' అని తలెత్తి చూసే సరికి నిన్న రైల్లో అబ్బాయి!'

'ఇలా తెండి.'

రామ్మూర్తి రెండు కాగితాల్నీ అందించాడు.

'ఇదెందుకు? అని మెల్లగా అని చిల్లర ఇచ్చే శాడు ముకుందరావు.

ఆ నాటి రాత్రి సినిమాకు వెళ్లాడు ముకుంద రావు. రామ్మూర్తి ఆయన్ను బుకింగ్ ఆఫీసు దగ్గరే చూశాడు. గాని ముందుగా హాల్లోకి వెళ్ళాడు. రిజర్వుడు క్లాసులో పంకా కింద తను ఓసీటులో కూచుని పక్కసీటులో మిత్రుడు కృష్ణయ్యను కూర్చోపెడుతున్నాడు. కాని అతను ఏదో పనుండి అవతలికి వెళ్ళాడు.

ఇంతట్లో ముకుందరావు వచ్చాడు. మసక చీకట్లో మనుషుల్ని అంతగా గుర్తించ నవసరం లేకపోయింది ఆయనకి. రామ్మూర్తి పక్క సీటులో కూచుండిపోయాడు.

'ఇక్కడ ఇంకొకరున్నారండి.'

అకస్మాత్తుగా ముకుందరావు అటు చూశాడు! మళ్లీ ఆరైల్లో అతనే! రిజర్వేషన్లు లేవన్న మనిషి అతని మాట అతనికెందుకు ఒప్పుకోకూడదు?

'ఏమిటండీ - ఈ కల్చర్డ్ ఏజ్‌లో ఇంకా రిజర్వేషన్లు?'

కల్చర్డ్ ఏజి అయితే మాత్రం స్నేహం పోతుందిటండీ?'

'అయినా ఎవరితో పడితే వారితో స్నేహము వైరమూ చేసుకోడానికి స్వేచ్ఛ వుంటిగా!'

'ఉంటే పాత స్నేహాలు పోవాలా?'

'చస్తే చస్తాయి లేకపోతే లేదుగాని రిజర్వేషన్లు చెయ్యడానికి స్పెషాలిటీసు కావాలిగా! అవి లేనంత సేపూ రిజర్వు చెయ్యకండి' అన్నాడు ముకుందరావు నిబ్బరంగా.

'స్పెషాలిటీనా?- సరే. రిజర్వుడు క్లాసుగా. అదే స్పెషాలిటీ రిజర్వేషనుకి' అని నవ్వాడు రామ్మూర్తి.

ఇంతలో కృష్ణయ్య వచ్చాడు. మీ రా ముకుందరావుగారూ ఇక్కడ కూచున్నారు!

'ఇందులో కూర్చొయ్యండి' అని పక్క కుర్చీ చూపించాడు.

ముకుందరావు కొంచెం గాభరాపడి లేచి- 'ఏమిటోయ్! ఇతను నీ ఫ్రెండా?' అని పక్క కుర్చీలో కూచున్నాడు.

కృష్ణయ్య 'అవునండీ - నిన్ననే వొచ్చాడు' అన్నాడు కుర్చీలో కూచుంటూ. రామ్మూర్తి చెవిలో 'ఏమిట్రా నా తండ్రీ ఆయనతో అప్పుడే యుద్ధం చేశావూ?' అన్నాడు.

'చంపేశావురా బాబూ! ఇప్పుడా నిన్న పొద్దుటినుంచీ కనిపించినప్పుడల్లా దెబ్బలాడుతూనే వున్నాను మనవాడేనేంటి కొంపదీసి?' అని నవ్వాడు రామ్మూర్తి.

'అంత దగ్గరవాడు కాదులే'

మర్నాడు ఉదయం ఎనిమిదింటికి ముకుంద రావు స్నానం చెయ్యడానికి పెరట్లోకి వెళ్లుతున్నాడు. ఇంతట్లో మిత్రుడు వెంకటేశ్వరరావు వొచ్చి 'ఏమోయి ముకుందం' అన్నాడు.

'ఏమిటిలా కొట్టుకొచ్చావు పొద్దున్నే!' అన్నాడు ముకుందరావు.

'సరి. అప్పుడే మరిచిపోయావ్? మీ అమ్మాయికి తగినవరుణ్ణి చూస్తానని నేను మాటిచ్చాను!'

'ఓహో! తీసుకొచ్చావేమిటి?'

'ఇప్పుడా! నిన్ననే తీసుకొద్దామనుకున్నాను తీరుబడి లేకపోయింది. సాట్లో కూచోబెట్టాను ఓమాటు రాలేవూ?'

'రాలేక పోవడమేం?'

సావిట్లోకివచ్చే రిద్దరూ. కుర్చీలో కూచున్న యువకుణ్ణిచూసి ముకుందరావు తెల్లబోయాడు.

'ఇతనా?-నాకు తెలుసునయ్యా!' అన్నాడు అప్రయత్నంగా.

'ఎలా తెలుసు?'

'అది వేరేకథ—ఊం-హుం-సరే బాగానే వుంది-నాకు తెలిసినంతమట్టుకు కుర్రాడు ఘట్టివాడే!'

# నిర్దాక్షిణ్యం

యం. హీరాలాల్ రాయ్

జేబులో పది డబ్బులుంటే, మనిషి ఆకాశం లోకి చూస్తాడు. ఖాళీ జేబు కనపడేప్పటికి కళ్లు నేలకి దిగుతాయి. ఇది మనిషి తప్పు కాదు. ఇది డబ్బు తప్పు. ఈ డబ్బును సృష్టించిన దుర్మార్గుడెవడో కాని, మనిషిలో హృదయాన్ని చంపి క్రూరత్వాన్ని నింపి, లోకాన్ని పాడుపాడు చేశాడు. డబ్బుకోసం దొంగతనాలు, డబ్బుకోసం పోరాటం, డబ్బుకోసం హత్యలు, డబ్బుకోసం మానభంగాలు, డబ్బుకోసం అన్నీ. ఏదైనా ఒక ప్రభుత్వం గట్టిగా "ఈ డబ్బు చెల్లదు" అని శాసనం చేస్తే ఎంత బావుండును! ఆ శాసనం "ఎనౌన్సు" చేసిన మరుక్షణాన, కోటీశ్వరులు గుండె పగిలి చచ్చేవాళ్లు. లక్షాధికార్లకు మూర్ఛరోగం వచ్చి నాలుగు రోజుల్లో చచ్చేవాళ్లు. వేలూ వందలూ వున్న వాళ్లు టైఫాయిడ్‌తో బాధపడి క్రమంగా కోలుకునే వాళ్లు. నాలాంటి ఏమీ లేనివాడు ఒక్క గంతువేసి మరో పదిపౌన్లు బరువు పెరిగేవాడు.

ఓమరు ఖయ్యాం రోజుల్లో, డబ్బు చెలామణిలో వుందో లేదో కాని వున్నప్పటికీ-డబ్బు అంతగా అవసరముండేదనుకోను ఎటుచూచినా ఇప్పచెట్లు, ద్రాక్ష తీగలు పైనకు పదిగిన్నెల సారాయి. చేయిచాచి ఓ గ్లాసెడు సారాయి పోయమన్నా అంటే, నేడు మంచి నీళ్లందించినట్టు ఇచ్చేవాళ్లు. పళ్లు, కూరగాయలు, ధాన్యాలు చవకగా దొరికేవి. అందుకే ఓమరు మహాకవి "బాగా తాగి, తిని, ప్రియురాల్ని అనుభవించి చావ"మన్నాడు హాయిగా. నేడు అలాకాదు. ఎంత పెనుగులాడినా కడుపునిండా తిండి దొరకదు. పెళ్ళాం అంటూ వుంటే, దాని పొట్ట నింపేవరకు తలప్రాణం తోకకు వస్తుంది. ఎంత కిరాయి పెట్టినా, బస్తీల్లో మంచి ఇల్లుదొరకదు. మంచి తిండి లేదు. ఇట్లా నరకంలో బతకడం నేడు మానవునికి ఎంతో చికాకు కలిగిస్తున్నది,